పల్లెలకు వెలుగు దూరం..!

ఏళ్ల తరబడి బస్సు సౌకర్యానికి నోచుకోని గ్రామాలు

- నాడు రోడ్డు లేక ..
- నేడు రోడ్డు, డిపో ఉన్నా ప్రయోజనం శూన్యం
- 'మహాలక్ష్మి'కి దూరమవుతున్న మహిళలు


బస్సులు లేక ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న గిరిజనులు

గుండాల: నాడు రోడ్డు సౌకర్యం లేక పడరాని పాట్లు పడిన గిరిజనులకు నేడు రవాణా మెరుగుపడినా బస్సులో ప్రయాణించే అదృష్టం రావడం లేదు. ఇటీవల నూతనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంతో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి గిరిజన మహిళలు నోచుకోవడం లేదు. నిత్యం ప్రైవేటు వాహనాలలో ప్రయాణాలు కొనసాగిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక అత్యవసర పరిస్థితుల్లో అధికమొత్తంలో చార్జీలు వెచ్చించి ప్రయాణించాల్సి వస్తుందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇది మండలంలోని చెట్టుపల్లి, శంభునిగూడెం పంచాయతీ గ్రామాల పరిస్థితి. ఆయా పంచాయతీల పరిధిలో చుట్టుపక్కల ఎనిమిది గ్రామాలు ఉన్నప్పటికీ ఆ పల్లెలకు నేటి వరకు బస్సు సౌకర్యం లేదు.

నాడు రోడ్డు లేకున్నా..

మండల కేంద్రం నుంచి చెట్టుపల్లికి రోడ్డు సౌకర్యం లేకపోయినా ఇల్లందుకు చెందిన ఓ ప్రైవేట్ బస్సు నడిపారు. నాడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని కొంతమేర బీటీ రోడ్డు వేయించారు. క్రమక్రమంగా రోడ్డు గుంతలమయంగా మారింది. అయినా ఆయా పంచాయతీ ప్రజలు ఇటు గుండాల రావాలన్నా, ఇల్లెందు వెళ్లాలన్నా నానా తంటాలు పడేవారు. రోడ్డు కావాలని, బస్సులు నడపాలని ప్రజాప్రతినిధులను జిల్లా అధికారులను వేడుకున్న దాఖలాలు అనేకం.

రోడ్డు ఉన్నా ప్రయోజనం సున్నా...

మండల కేంద్రానికి 22 కి.మీల దూరంలో చెట్టుపల్లి–లింగాపురం వరకు రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు నిర్మించారు. అటు ఇల్లెందు–కొమరారం మీదుగా పాలగండిపై కూడా బీటీ వేయడంతో ఇల్లెందు నుంచి ఇటు గుండాల నుంచి రవాణా మెరుగుపడింది. అయినా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు వీలున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

'మహాలక్ష్మి'కి దూరం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి మహాలక్ష్మి పథకం ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలకు వినియోగం లేదు. బస్సులు లేనప్పుడు ఆ పథకం మాకెందుకని వాపోతున్నారు. బస్సులు నడపక ప్రయివేటు వాహనాలే దిక్కయ్యాయి.

సమీపంలోనే ఇల్లెందు డిపో

గతేడాది ఇల్లెందులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసిన క్రమంలో బస్సు సర్వీలు పెరుగుతాయని మా పల్లెలకు బస్సులొస్తాయని కలలు కన్నారు. కానీ ఆ సర్వీలు పెరగక పల్లెలకు బస్సులు నడవక ప్రజలు నిరాశచెందారు. ఆర్టీసీ బస్సులు నడవని పల్లెలు గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో అనేక ఉన్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అవసరాల నిమిత్తం ప్రయాణించే వారంతా ప్రయివేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని వేడుకుంటున్నారు.

పిల్లల కోసమైనా నడపాలి...



మా చిన్నతనం నుంచి కాలినడనే ప్రయాణం చేసినం. మా ఊళ్లకు బస్సులు రావడం చూడలేదు. రోడ్డు అయ్యాక ఆటోలు వస్తున్నయ్. ఇప్పుడున్న పిల్లలను ఇబ్బంది పెట్టకుండా బస్సులు నడపాలి.

– మోకలి పాపమ్మ, శంభునిగూడెం

'మహాలక్ష్మి' మాకు దూరం



కొత్తగా వచ్చిన పాలకులు మహాలక్ష్మి పథకం పెట్టి ఉచితంగా ప్రయాణం అని చెప్పిండు. కానీ మా గ్రామాలకు బస్సులేవు. దీంతో పథకం మొదలైనా మాకు పెద్దగా ఉపయోగపడడం లేదు.

– ఈసం నర్సమ్మ, శంభునిగూడెం

బస్సులు నడపాలని వేడుకుంటున్నాం



ఏళ్ల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పుడు రోడ్డు పనులు పూర్తయ్యాయి. గుండాల నుంచి మా ఊరు మీదుగా ఇల్లెందు వరకు బస్సు నడిపితే సమస్య తీరినట్లే.

– చాట్ల పాపయ్య, గొరకలమడుగు

క్లుప్తంగా

ఉచిత విద్యుత్‌కు పరిశీలన ప్రారంభం

భద్రాచలంఅర్బన్: ఉచిత విద్యుత్ పథకాన్ని అర్హులైన వారి వివరాలను విద్యుత్ శాఖ అధికారులు నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని అశోక్‌నగర్ కొత్త కాలనీలో నిర్వహించిన లబ్ధిదారుల నమోదు ప్రక్రియను విద్యుత్ శాఖ ఏడీఏ వేణు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివాస ప్రాంతం అందుబాటులో లేనివారు ఆందోళన చెందొద్దని, నెలరోజుల పాటు విద్యుత్ శాఖ కార్యాలయంలో నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డులతో పాటు కరెంటు బిల్లు తీసుకొస్తే విద్యుత్ శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని సూచించారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

బూర్గంపాడు: మండలకేంద్రంలోని గౌతమిపురం కాలనీకి చెందిన కొండా సురేంద్ర అనారోగ్యంతో అవయవాలన్నీ దెబ్బతిని పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు మోరంపల్లిబంజర గ్రామానికి చేయూత ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం సురేంద్ర కుటుంబ సభ్యులకు రూ.11 వేల నగదు అందించారు. ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు కైపు నాగిరెడ్డి, మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి, శివ, మల్లేశ్వరరావు,రామచంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ డోర్ డెలివరీ నిర్వహణకు టెండర్లు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీ కాలనీలో ఎల్‌పీజీ గ్యాస్(హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్) సిలిండర్లను వినియోగదారులకు డోర్ డెలివరీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుండి టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏరియా అధికార ప్రతినిధి సలగల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని ఓసీ ప్రభావితులు, భూనిర్వాసితులు, సింగరేణి మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు పిల్లలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ధృవీకరణపత్రాలు, ఆధారాలతో ఏరియా జీఎం కార్యాలయంలో గల పర్చేజ్ విభాగంలో ఈ నెల 22 మధ్యాహ్నం 12 గంటల కల్లా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్న ముగ్గురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పేరాయిగూడేనికి చెందిన తగరం అనంత దేవికు ఇదే గ్రామానికి చెందిన వినోద్ కుమార్‌తో మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. కొంతకాలంగా అనంతదేవిను అదనపు కట్నంకోసం భర్తతోపాటు, మామ తగరం సత్యనారాయణ, అత్తయ్య వెంకట రమణ వేధిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దమ్మపేట: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నెమిలిపేట గ్రామానికి చెందిన కొంద్రు సంధ్యను భర్త వినోద్‌కుమార్ వేధింపులకు గురి చేస్తూ భౌతిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నాటు సారా తరలిస్తున్న వారిపై...

దమ్మపేట: నాటు సారాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొద్దులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తనిఖీ చేస్తుండగా గండుగులపల్లి గ్రామానికి చెందిన పూచి లక్ష్మణరావు, మొద్దులగూడెంకు చెందిన పూచి సీత బైక్‌పై నాటు సారాను తీసుకెళ్తూ పట్టుబడ్డారు. వారి దగ్గర నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పందెం రాయుళ్లపై...

దమ్మపేట మండలంలోని మల్లారం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో స్థావరంపై దాడి చేసి నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు కోడి పుంజులు, రూ.3,250ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఎంపీటీసీ మృతి

మణుగూరు రూరల్/ మణుగూరుటౌన్: మండలంలోని పగిడేరు పంచాయతీ సీపీఎం ఎంపీటీసీ కుంజా కృష్ణకుమారి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలు పార్టీల మండల నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గుండాల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని విప్లవకారులంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య పిలుపునిచ్చారు. మార్చి 3, 4, 5 తేదీల లో ఖమ్మంలో జరిగే జాతీయ మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆళ్లపల్లి మండలంలోని సందిబంధం గ్రామంలో ఆవిష్కరించారు. మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన న్యూడెమోక్రసీ మండల కమిటీ సభ్యులు దుగ్గి రాంబాబు ఎలియాస్ రియాజ్ ప్రజాపంథా పార్టీలోకి గుమ్మడి నర్సయ్య సమక్షంలో చేరారు. మాచర్ల సత్యం, శంకర్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్, అనంతోగు మాజీ సర్పంచ్ ఈసం చంద్రయ్య, ఆళ్లపల్లి ఏరియా ఆర్గనైజర్ బోర్ర వెంకన్న, నాయకులు పాయం వెంకన్న, గొగ్గెల వెంకటేశ్వర్లు, పార్టీ గుండాల మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, సమ్మయ్య, పూనెం మంగయ్య, భరత్, సారయ్య, కృష్ణకుమారి, శోభన్ బాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

'దళితబంధు' అమలు చేయాలి

చర్ల: గత ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులందరికీ వెంటనే రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చర్లలో అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం లబ్ధిదారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... గత ప్రభుత్వం హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారులందరికీ ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్, నాయకులు ముసలి సతీష్ సంఘీబావం తెలిపారు.

కరకట్ట పనులు చేపట్టాలని ఆదేశం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కరకట్ట నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించినట్లు భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ సమన్వయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సుభాష్‌నగర్ కాలనీలో ఉన్న కరకట్ట నిర్మాణం అసంపూర్తిగా నిలిచిందని మంత్రికి తెలపడంతో పనులు వెంటనే చేపట్టాలని ఆయన ఇప్పటికే సంబంధిత అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి తుమ్మలకు ముంపు వాసులతో పాటు సమన్వయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

చర్ల సీహెచ్‌సీకి 14 మంది స్టాఫ్‌నర్సులు

చర్ల రూరల్: చర్లలోని సీహెచ్‌సీకి 14 మంది స్టాఫ్ నర్సులను కేటాయించినట్లు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల ప్రధాన సమన్వయకర్త డాక్టర్ రవిబాబు తెలిపారు. ఈ మేరకు త్వరలోనే వారు విధుల్లో చేరతారని పేర్కొన్నారు. అలాగే, నెలలోగా పోస్టుమార్టం గది నిర్మాణం పూర్తి చేస్తామని, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు పోస్టులు భర్తీ చేసి స్వీపర్‌ను సైతం నియమిస్తామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

వృద్ధాశ్రమ నిర్వహణ అభినందనీయం



ఆశ్రమ నిర్వాహకులకు సన్మానం..

అశ్వాపురం: పదమూడేళ్లుగా వృద్ధాశ్రమం నిర్వహిస్తూ వృద్ధులకు సేవచేయడం అభినందనీయమని అరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమం నిర్వాహకుల సేవలను పలువురు అభినందించారు. మండల కేంద్రంలో మంచికంటినగర్ గ్రామం వద్ద అరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమం నూతన భవనం శుక్రవారం ప్రారంభించారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు మెహరాజ్–షహనాజ్ దంపతులను ఘనంగా సన్మానించారు. సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, గాదె కేశవరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్, నాయకులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలుచేయాలి

మణుగూరు రూరల్ : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర నాయకులు ఎండీ.రాసుద్దీన్, ఏరియా అధ్యక్షులు మంగీలాల్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు హైద్రాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఇఫ్టూ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెంపుపై జీవో విడుదల చేయాలన్నారు. సొంతింటి పథకానికి భూమితో పాటు నిదులు మంజూరు చేయాలని, డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఏరియా అధ్యక్షులు మంగీలాల్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌లది కీలకపాత్ర


సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

కరకగూడెం: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, ఉప సర్పంచులు కీలకపాత్ర పోషించారని ఎంపీపీ రేగా కాళికా ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం భట్టుపల్లిలోని రైతు వేదికలో ఎంపీపీ ఆధ్వర్యంలో తాజామాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు పంచాయతీ సిబ్బందితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ రేగా కాళికా మాట్లాడుతూ.. స్పెషల్ ఆఫీసర్లు ప్రణాళిక ప్రకారం గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఎంపీడీఓ బి.శంకర్, ఎంపీఓ కుమార్, పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న శ్యామ్ కిరణ్

భద్రాచలంటౌన్: విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఐటీసీ జనరల్ మేనేజర్ పి.శ్యామ్ కిరణ్ అన్నారు. భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ దేవదాసు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మార్కులు ఎలా వస్తాయనే విషయాన్ని తెలుసుకుని, ఒక పద్ధతి ప్రకారం చదువుతూ ముందుకు సాగాలని సూచించారు. కష్టపడి చదివే పిల్లలకు ఐటీసీ సంస్థ తరపున సహకారం అందజేస్తామన్నారు. ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తలసేమియా బాధిత బాలుడికి 'భరోసా'


చెక్కు అందజేస్తున్న దుర్గం రాంచందర్

మణుగూరు టౌన్: నిరుపేద కుటుంబానికి చెందిన కుంచాల వెంకటేశ్వర్లు కుమారుడు షణ్ముక్ తలసేమియా బాధపడుతుండగా, విషయం తెలుసుకున్న భరోసా స్వచ్ఛంద సంస్థ మందుల నిమిత్తం రూ.50 వేల చెక్కును ఏరియా జీఎం దుర్గం రాంచందర్ చేతుల మీదుగా జీఎం కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, వెంకటేశ్వర్లు, రమేశ్, షబ్బీరుద్దీన్, నబీ, మదార్, భరోసా సభ్యులు లింగబాబు, అమీన్, వరుణ్, భరత్, కుమార్ తదితరులు ఉన్నారు.

పంచాయతీల్లో డ్రైడే...

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వినాయకపురం, పేరాయిగూడెం, ఊట్లపల్లి, గుమ్మడవల్లి, దిబ్బగూడెం, ఆసుపాక, నారాయణపురం, అశ్వారావుపేటతోపాటు మిగిలిన అన్నీ జీపీల్లో చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేయించారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, డాక్టర్ స్వప్న, కేఎస్‌బీ కృష్ణ, నవీన్, సీతారామరాజు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రైడేను పర్యవేక్షిస్తున్న శ్రీనివాసరావు

జాతర పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

దుమ్ముగూడెం: ఈ నెల 27 నుండి మార్చి 2 వరకు మండలంలోని మారాయిగూడెం గ్రామంలో నిర్వహించే శ్రీ సమ్మక్క–సారాలమ్మ మినీ మేడారం జాతర వాల్‌పోస్టర్లను శుక్రవారం రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ఆవిష్కరించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో దేవర బాలు సోడి శాంతమ్మ, అచ్చమ్మ, తిమ్మ శాంతమ్మలతో కలిసి మంత్రి సీతక్కను కలిసి పోస్టర్లను ఆవిష్కరించి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఐదు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కుబడులను చెల్లించుకుంటారని వారు సీతక్కకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అపకా వీర్రాజు, శ్రీను, జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, సలీం, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తుల పరిశీలనను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

బూర్గంపాడు: ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ అధికారులకు సూచించారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో రూ.500 గ్యాస్ కనెక్షన్ల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తుల ఇంటింటి పరిశీలనను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తులలో తప్పులుంటే సరిచేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలనలో అర్హులెవరికీ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి వివరాలను కచ్చితంగా నమోదు చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్ రామ్, పంచాయతీ కార్యదర్శి బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ. 10 కోట్లు

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్: పినపాక నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.10 కోట్ల ప్రత్యేక గ్రాంట్ నిధులను మంజూరు చేసినట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేయగా స్పందించిన సీఎం స్పెషల్ గ్రాంట్ నిధులను మంజూరు చేశారని, ఇందుకు గానూ సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, కల్వర్టుల వంటి నిర్మాణాలను చేపట్టనున్నామన్నారు. ఇప్పటికే ఆయా పనుల విషయంపై సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి చర్చించామని, నివేదికల ప్రకారం పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి

భద్రాచలంఅర్బన్: కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించే భారత్ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఈ బంద్‌లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ పట్టణ, శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ విఫలమైందన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకటరామారావు, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, జీవనజ్యోతి, కోరాడ శ్రీనివాస్, శాఖ కార్యదర్శులు కుమారి, సక్కుబాయి, పుణ్యవతి, నాగలక్ష్మి, శ్రీను, కృష్ణ, ఆది, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: సమ్మెకు ప్రజలంతా సహకరించాలని సీఐటీయు మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ, ఆటో యూనియన్ ప్రతినిధులకు సమ్మె నోటీస్‌లను అందించారు. పుష్ప, వెంకటలక్ష్మీ, కోట దారుగా, సతీష్, సంతోష్, యాకుబ్, కోటి, బాబా, చాంద్, అన్వర్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

దుమ్ముగూడెం: కుష్ఠు వ్యాధి గ్రస్తులతో స్నేహభావంగా మెలిగి వారిలో ఆత్మస్థైర్యంతో కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దామని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలతోపాటు పలు గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులతో కుష్ఠువ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది, అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'కేంద్ర' పథకాలతో అభివృద్ధి

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతోనే పేదలకు లబ్ధిచేకూరి అభివృద్ధి చెందుతున్నారని, ప్రతీ ఒక్కరు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బానోత్ విజయలక్ష్మి అన్నారు. భద్రాచలంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గావ్‌ఛలో అభియాన్, పల్లెనిద్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తు కరపత్రాలను పంచారు. పట్టణ అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, కుంజా ధర్మారావు, నాగబాబు, వెంకన్న, శ్రీనివాస్, సుదర్శన్, శ్రీహరి, వెంకటేశ్వర్లు, నిఖిల్, హరీష్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ మణెమ్మ

దమ్మపేట: ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని భద్రాచలం ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. మండలంలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ డీడీ, గురువారం రాత్రి మణెమ్మ ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం తోలెం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, శ్యామల, లత, వెంకటరమణ, రత్న, రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సాయం

అశ్వాపురం: తాము పుట్టిన గ్రామాభివృద్ధికి ఎన్ఆర్ఐలు తమ వంతు సహాయ సాకారాలు అందించారు. మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు కందిమళ్ల సత్యనారాయణరెడ్డి, జాలె సుధాకర్‌రెడ్డి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో సౌకర్యాల కోసం శుక్రవారం రూ.50 వేలు అందజేస్తామని ప్రకటించారు. ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, సబ్‌సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోనిశ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సుదర్శన హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం శ్రవణ నక్షత్ర పర్వదినం సందర్భంగా, దేవాలయంలో వెంకటేశ్వరునికి ప్రత్యేక అర్చన, అభిషేకం, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు యజ్ఞాచార్యులు, గిరధరాచార్యులు చేతులమీదుగా వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా కనులవిందుగా జరిపించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కరకగూడెం: గ్రామంలోని యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలి కరకగూడెం ఎస్సై రాజారాం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని నీలాద్రిపేట, అశ్వాపురంపాడు వలస ఆదివాసీ గ్రామాలను సందర్శించి గ్రామస్తులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాలీబాల్ కిట్స్ అందజేశారు.

శివాలయంలో శత జయంతి మహోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మిథిలా నగర్‌లోని రామాలయం అన్నదాన సత్రం ఎదురుగా ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శత జయంతి మహోత్సవాలతో పాటు స్వామివారి కల్యాణ వేడుకకు శుక్రవారం అంకురార్పణ చేశారు. శివాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో మొదటి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేద పండితులు శాస్త్రోత్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.